క్లుప్తంగా

నేడు 2.5కే రన్

ఆసిఫాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 5.30 గంటలకు జిల్లా కేంద్రంలో తెలంగాణ 2.5కే రన్ నిర్వహిస్తున్నట్లు సీఐ రాణాప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఏఆర్ హెడ్క్వార్టర్స్ నుంచి వివేకానంద చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్, కుమురంభీం చౌక్, పిల్లల పార్కు, కలెక్టర్ క్యాంపు కార్యాలయం మీదుగా తిరిగి ఏఆర్ హెడ్క్వార్టర్స్ వరకు కొనసాగుతుందన్నారు. ఎస్పీ సురేశ్ కుమార్ కార్యక్రమం ప్రారంభిస్తారని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయాలి

రెబ్బెన: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆసిఫాబాద్‌లో నిర్వహించే 2.5కే రన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్‌లు అన్నారు. సోమవారం ఉదయం 5 గంటలకు రెబ్బెన పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు అందుబాటులో ఉంటుందని, ఆసక్తి గల యువకులు రన్‌లో పాల్గొనాలని కోరారు.

14న మండల సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు జేపీఎస్, టీఏలకు సమావేశం

కెరమెరి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం టీఏలు, ఎఫ్ఏలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు హరితహారం, సామాజిక తనిఖీ, ఏడు రకాల రికార్డులు నమోదు, నర్సరీల రిజిస్ట్రేషన్ అప్‌డేషన్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అందుకు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్‌ప్రాంత సమీపంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సదాశివ మాస్టర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణ, మండల పద్మశాలి సేవా సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. సంఘం ప్రతినిధులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్, ప్రవీణ్ కుమార్, బూర సమ్మయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



పురస్కారాలు అందజేస్తున్న ప్రతినిధులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబర్చిన ఆర్యవైశ్య విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గులబం చక్రపాణి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండలంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం ప్రతినిధులు, జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, పురపాలిక వైస్ చైర్మన్ రాచకొండ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సైకిల్, కిరాణ సామగ్రి అందజేస్తున్న మిత్రులు

ఆసిఫాబాద్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చిన్ననాటి మిత్రులకు ఆర్థిక సాయం అందజేసి కొందరు మిత్రులు మానవత్వం చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 1980 –81 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి మిత్రుడు ప్రకాశ్‌కు రూ. 6వేల విలువ చేసే సైకిల్, మల్లికార్జున్‌కు రూ.10 వేల విలువ చేసే కిరాణ సామగ్రి, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న రషీద్‌కు రూ. 25వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రఫీక్ జీవాని, రావుల గురుమూర్తి, రావుల మురళీధర్, పెంద్యాల సురేశ్, మంథెన మహేశ్, పిన్న వివేక్, రాపర్తి నవీన్, రావుల శివకుమార్, రావుల నారాయణమూర్తి, సుబ్బతిరుమల్‌రావు పాల్గొన్నారు.

గొంతు తడపని 'భగీరథ'

- గ్రామాల్లో కలుషిత నీరే దిక్కు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



డబ్బా పంచాయతీ బారెగూడలో వ్యవసాయ బోర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. కొన్ని గ్రామాల్లో కుళాయిలు బిగించినా నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. దీంతో సమీపంలోని వాగులు, చెరువులు, వ్యవసాయ బావుల నీటిని ప్రజలు తాగుతున్నారు. బావుల్లో, చెరువుల్లో నీరు కలుషితంగా ఉంటుందని ఆ నీటిని తాగితే రోగాలు వ్యాపించే అవకాశం ఉంటుందని స్థానికులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని బాబాసాగర్, రుద్రాపూర్, చిత్తాం, గంగాపూర్, రణవెల్లి, డబ్బా, బారెగూడ, అడెపెల్లి, రవీంద్రనగర్, దిందా, కోయపెల్లి, జాజులగూడెం, నందికొండ, అంబగట్టు, హేటిగూడ తదితర గ్రామాలలో ఏటా నీటి ఎద్దడితో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కాలమేదైనా ఆయా గ్రామాల ప్రజలు నీటికోసం వాగులు, బావులపైనే ఆధారపడుతుంటారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో సైతం నీటి సరఫరా లేకపోవడంతో పరిసరాలలో ఉన్న చేతిపంపులే విద్యార్థులకు దాహం తీరుస్తున్నాయి.

నీరందించని మిషన్ భగీరథ..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం గ్రామాలలో పూర్తిస్థాయిలో విఫలమవుతోంది. మండల కేంద్రంలో కుళాయిలు ఉన్నా నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. మండలంలోని పెద్ద గ్రామ పంచాయతీ రవీంద్రనగర్, గూడెం, రణవెల్లి, బాబాసాగర్, డబ్బా, ఖర్జెల్లి, రుద్రాపూర్ గ్రామాలలో సైతం నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. కొన్ని చోట్ల పాక్షికంగా సరఫరా చేస్తే మరికొన్ని గ్రామాలలో ఒకటి, రెండు వాడలకు పరిమితం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులపై ఒత్తిడి..

నీరు సరఫరా కాకపోవడంతో గ్రామాల్లోని ప్రజలు సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. మరోవైపు నీటి సరఫరా కోసం నిలదీసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తుండగా, నిధులు లేక కాంట్రాక్టర్లు సహకరించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

మరమ్మతులు నిర్వహిస్తాం

స్థానికంగా గ్రామాల్లో లీకేజీలను పరిశీలిస్తున్నాం. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతాం. నిధులు లేక పనుల్లో జాప్యం జరుగుతోంది. సహకరించని కాంట్రాక్టర్ల స్థానంలో కొత్త కాంట్రాక్టర్లను తీసుకుంటాం. నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఉదయ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ

ఎండుతున్న 'అమ్మన్నమడుగు'



నీరులేక ఎండిపోతున్న అమ్మన్నమడుగు ప్రాజెక్టు

- ఆందోళనలో రైతులు



ఎండిపోయిన ప్రాజెక్టు మత్తడి

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామానికి సమీపంలో ఉన్న అమ్మన్నమడుగు ప్రాజెక్టు ఎండిపోతోంది. తీవ్రమైన ఎండలకు భూగర్భజలం ఇంకిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన మూడు నెలల నుంచి పంట పొలాలకు చుక్కనీరందలేదు. ఎప్పుడూ నీటితో కళకళలాడే మత్తడి నీరు లేక బోసిపోయింది. నీటి ప్రవాహం లేక కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రాజెక్టు సమీపంలో ఇటీవల ఊరూరా చెరువుల పండుగ కూడా చేశారు.

ఆరు వేల ఎకరాలకు సాగునీరు..

ఆరు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కెరమెరి మండలంలోని కేస్లాగూడ వాగుపై రూ.16కోట్ల నిధులతో అమ్మన్నమడుగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. రూ.10 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణాం పూర్తి కాగా, రూ.6 కోట్లతో కాలువల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఏ వేసవిలోనైనా ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండేది. కాని ఈసారి ఎండల తీవ్రత అధికం కావడంతో నీరు లేక ప్రాజెక్టు బోసిపోయింది.

లబ్ధిపొందే గ్రామాలు..

మండలంలోని కెరమెరి, మెట్టపిప్రి, హట్టీ, ఝరి, మోడీ, సాకడా, సుర్దాపూర్ గ్రామాల్లోని పొలాలకు సాగునీటి సౌకర్యం అందాల్సి ఉంది. కాని మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చుక్కనీరు అందలేదు. ప్రాజెక్టులోని నీరు పొలాలకు అందితే మంచి పంటలు పండిస్తామని ఆశించిన రైతులు నిరాశ చెందారు. చాలా ప్రాంతాల్లోని కాలువలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. అధికారులు కాలువల నిర్వహణ చేపట్టడం లేదు.

ఉత్తమ కవులు వీరే



వివేక్‌ను సన్మానిస్తున్న జిల్లా అధికారులు

ఆసిఫాబాద్: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాహిత్య దినోత్సవంలో ఉత్తమ కవులను ఎంపిక చేశారు. పద్య కవుల్లో ధర్మపురి వెంకటేశ్వర్ ప్రథమ, దేవరాజు రేవతి ద్వితీయ, ఇందారపు మధూకర్ తృతీయ, కిల్లి వెంకట్రావు నాల్గొవ, తొడసం నాగోరావు ఐదో స్థానంలో, వచన కవుల్లో ఎల్మల ప్రశాంత్ కుమార్ ప్రథమ, శ్రీరామోజు లక్ష్మీరాజయ్య ద్వితీయ, గుర్రాల వెంకటేశ్వర్లు తృతీయ, నల్లగొండ రమేశ్ నాల్గొవ, బంక శ్రీలత ఐదో స్థానంలో, ఉర్దూ విభాగంలో డాక్టర్ రహీమ్ రామిష్ ప్రథమ, ఎండీ తన్వీరొద్దిన్ ద్వితీయ, ఎండీ అక్బర్ తృతీయ, అత్తరొద్దిన్ నాల్గొవ, ఎండీ ఆరిఫొద్దిన్ ఐదో స్థానంలో నిలిచారు.

ధవళే వివేక్‌కు సన్మానం

కెరమెరి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది దినోత్సవంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సాహితీ దినోత్సవంలో చక్కటి కవితాగానం చేసిన మండల కేంద్రానికి చెందిన ధవళే వివేక్‌ను జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్ ఘనంగా సన్మానించారు. తెలుగు సాహిత్యంలో మరెన్నో కవితలు రాయాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని అభినందించారు. ప్రస్తుతం వివేక్ సిర్పూర్(యూ) మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. వివేక్ రాసిన 'అహింసతోనే అఖండమైన తెలంగాణ' కవిత్వాన్ని తెలంగాణ ఉత్సవాల సందర్భంగా ప్రచురించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటస్వామి వివేక్‌ను అభినందించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు







రేణుక ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా రెబ్బెన మండల కేంద్రంలోని గౌడ కులస్తులు ఆదివారం పోచమ్మ బోనాలను అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. మండల కేంద్రంలోని గౌడ మహిళలు నెత్తిన బోనమెత్తుకుని డప్పు వాయిద్యాలతో ర్యాలీగా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు, బోనాలు సమర్పించారు. – రెబ్బెన

లీకేజీలతో రోడ్డంతా బురదమయం



బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బుద్ధుడి విగ్రహ ఏర్పాటు అభినందనీయం

సిర్పూర్(టి): నియోజకవర్గ కేంద్రంలోని నాగమ్మ చెరువులో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గౌతమ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని ఆదివారం సందర్శించారు. జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎంపీటీసీ తుకారాం, నాయకులు ఉన్నారు.

13నుంచి 'అప్లికేషన్ భరో'

జన్నారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అందరికీ వర్తింపజేయాలనే ఉద్దేశంతో 'దళితబంధు దళితుల హక్కు' నినాదంతో 'అప్లికేషన్ భరో' కార్యక్రమం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆదివారం తెలిపారు.

గౌడ కులస్తులకు ఆర్థిక సాయం అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

రెబ్బెన: కల్లుగీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గౌడ కులస్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల న్యాయమైన హక్కుల సాధన కోసం సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నాగుల బాలగౌడ్, లింగంపెల్లి బాలాగౌడ్, లక్ష్మి నారాయణగౌడ్, ప్రశాంత్‌గౌడ్, అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ ప్రజాగర్జన ముగింపు సభకు బెల్లంపల్లి ఏరియా గోలేటి బ్రాంచి నుంచి ఏఐటీయూసీ నాయకులు తరలివెళ్లారు. బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి మాట్లాడుతూ సింగరేణిలో ప్రైవేటీకరణను కేంద్రం ఆపాలని, కొత్త గనులను సింగరేణికే కేటాయించాలన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శ్రీనివాస్, శేషు, కిరణ్‌బాబు, ఫిట్ కార్యదర్శి కందుల మల్లేష్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు నర్సయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కరువు

- తాగునీరు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



నల్లా నీటినే తాగుతున్న ప్రయాణికుడు (ఫైల్)




నిరుపయోగంగా రైల్వేస్టేషన్‌లోని మరుగుదొడ్లు

సిర్పూర్(టి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సరైన వసతులు లేక రైల్వేప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో రైళ్ల ద్వారా ప్రయాణాలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి వసతి, మరుగుదొడ్లు, దివ్యాంగుల మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేకపోవడంతో ప్రతీరోజు ప్రయాణాలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి ప్రతిరోజు సిర్పూర్(టి) నియోజకవర్గం ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర ప్రజలు రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి రామగిరి ప్యాసింజర్, సింగరేణి ప్యాసింజర్, పుష్పుల్ ప్యాసింజర్ రైళ్లు ప్రతిరోజు కొనసాగుతుంటాయి. వీటిలో మారుమూల గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. రైల్వేస్టేషన్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించినా వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో మహిళా ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

తాగునీటి వసతి లేక రైల్వేస్టేషన్‌లో ఉన్న నల్లానీటినే ప్రయాణికులు తాగుతున్నారు. వేసవిలో నీరు వేడిగా ఉంటుండడంతో చాలా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధిక ధరలు వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేయలేక, వేడి నీటిని తాగలేక నిరుపేద ప్రయాణికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలపై ప్రయాణికులు, స్థానికులు రైల్వే అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికై నా రైల్వే అధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలి



రైల్వేస్టేషన్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు స్పందించి వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

– సంజీవ్, ప్రయాణికుడు

రైల్వే అధికారులు స్పందించాలి



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వసతి కల్పించాలి.

– భూపల్లి ప్రసాద్, ప్రయాణికుడు

'16న బెజ్జూర్‌కు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్'



మాట్లాడుతున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: మండలానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ నెల 16న రానున్నట్లు రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ తెలిపారు. బెజ్జూర్ మండలం నుంచి పల్లెపల్లెకు బీఎస్పీ.. ప్రగతి భవన్‌కు ఆర్ఎస్పీ అనే నినాదంతో ఆదివారం యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న ప్రవీణ్ కుమార్ మండలానికి వస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బెజ్జూర్ బస్టాండ్ ప్రాంతంలో సాయంత్రం 4 గంటలలకు రోడ్‌షో నిర్వహిస్తామన్నారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జీలుగ విత్తనాల పంపిణీ

చింతలమానెపల్లి: మండలంలోని రైతులకు సోమవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు సహకార బ్యాంకు అధికారి రాజు తెలిపారు. పాత దుబ్బగూడ పాఠశాల వద్ద విత్తనాలను రైతులకు అందజేస్తామని తెలిపారు.